# చిట్టి కథ

తలంటు పోసుకోవటం దగ్గర్నుంచి తలంబ్రాలు పోసుకోవటం దాక శకునం చూడకుండా ఏ పనీ చెయ్యదు శంకరమ్మ. శకునాల మీద ఆవిడ నమ్మకాలు కూడా చాలా గమ్మత్తుగావుంటాయి. నల్ల పిల్లి కనిపిస్తే అశుభం, తెల్లపిల్లి తారసపడితే శుభ సూచకం. బొచ్చు కుక్క ఎదురొస్తే అరిష్టం. బొద్దింక కనబడితే అదృష్టం. కాకి 'కావుకావు' మంటే కార్యనాశనం. మేక 'మే మే' అంటే మంచి శకునం. ఇలా తనకంటూ కొన్ని ప్రత్యేకమైన విశ్వాసాలని ఏర్పరుచుకొంది శంకరమ్మ. శోభనం నాడు గదిలో చూరుకింద బల్లి కిచ్‌కిచ్ మందని ఎంత బతిమాలినా భర్త పక్కన పడుకోడానికి నిరాకరించింది-ఆరాత్రి శంకరమ్మ. ఇప్పటికీ అందరితోటీ ఆ సంగతి గొప్పగా చెప్పుకుని మురిసిపోతూ వుంటుంది. అంతటి నమ్మకం ఆమెకి శకునాల మీద.

"బంగాళదుంపల వేపుడు చెయ్యమని చెప్పానే ఎందుకు చెయ్యలేదు?" అని భర్త అడిగితే "తరుగుదామని కూర్చున్నానండీ, సరిగ్గా అసమయానికి పక్కవాటాలో ఎవరో తుసుక్కుమని తుమ్మారు. అదీ ఒక్కటే తుమ్ము, కూర చెడిపోతుందని మానేశాను" అంటుంది శంకరమ్మ.

"అయితే శంకరం, ప్రతిపనీ శకునం చూసే చేస్తూవుంటావుకదా! పిల్లల్ని కూడా శకునంచూసే కన్నావా ఏమిటి?" అంటాడు భర్త చిలిపిగా.

"అవునండి! మన విజయ్ బయటపడ్డప్పుడు మన గదిలో దూలంమీద గూటిపిచ్చికలు కిచ్‌కిచ్ మనడం, అంత ప్రసవ వేదనలోనూ నేను స్పష్టంగా విన్నానండి. ఆ శుభశకునం మూలంగానే మనబ్బాయి అలా బి. కాం. పాసయ్యాడో లేదో ఇలా బ్యాంకిలో ఆఫీసరుగా సెలెక్టయ్యాడు. పార్వతి పుట్టినప్పుడు శకునం మాత్రం నాకు గుర్తు లేదు. మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆపరేషన్ చేసి తీశారు కదండీ" అంటుంది శంకరమ్మ.




పార్వతికి ఎన్ని సంబంధాలు చూసినా కట్నం దగ్గర బెడిసి కొడుతున్నాయి. విశాఖపట్నంలో ఎవరో వరుడు వున్నాడంటే చూసి రావడానికి శంకరమ్మ అన్నయ్య సదాశివం ప్రయాణమైనాడు. అతను స్టేషన్‌కి బయలుదేరడానికి టాక్సీ ఎక్కబోతూండగా నల్ల పిల్లి ఎదురైందని ఆ రోజు ప్రయాణం మానిపించింది శంకరమ్మ. మరునటి రోజు ఆటో ఎక్కబోతుండగా ఎవరో విధవావిడ ఎదురొచ్చిందని ఆ రోజూ ప్రయాణం వాయిదా పడింది. ఇలా కాదనుకుని మూడో నాడు తెల్లవారు జామున సదాశివాన్ని నిద్ర లేపి ప్రయాణం చేయించింది శంకరమ్మ. నొసట రూపాయంత కుంకుమ బొట్టుతో, చిరునవ్వుతూ అన్నగారికి తనే ఎదురొచ్చింది.

"వెళ్ళిరా అన్నయ్యా. అమ్మాయికి ఈ సంబంధం తప్పకుండా కుదురుతుంది" అంటూ సాగనంపింది.

సదాశివం ఎక్కిన ఆటో రైలు స్టేషన్ చేరకుండానే బోల్తాపడి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు అతను. గంట తరువాత ఆ వార్త విన్న శంకరమ్మ అవాక్కయిపోయింది.

కొన్ని రోజులు తరువాత....

"నీ శకునాల పిచ్చి ఎంత ప్రమాదానికి దారి తీసిందో చూశావా శంకరం? శకునం మంచిది కాదని రెండుసార్లు మీ అన్నయ్య ప్రయాణాన్ని ఆపావు. మూడోసారి నీవే శకునంగా వచ్చావు. చివరికి ఏమైంది? అతనే పోయాడు" అన్నాడు భర్త. "ఏమిటి మీరనేది? ఇప్పుడేమైందని? మా అన్నయ్యకి నా అనే వాళ్ళెవరూ లేరు_నేను తప్ప. నా పేర పాతిక వేలకి ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు మీకు తెలీదేమో. ఆ పాతిక వేలతో మన అమ్మాయికి బంగారం లాంటి సంబంధం వెతకొచ్చు" అన్నది శంకరమ్మ తన నమ్మకానికి మరింత ప్రాణం పోస్తూ!

—జి. మల్లీశ్వరి